# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

ఆదివారం 22, మార్చి 2026


## ముథోల్ అభివృద్ధికి

# రూ.70 కోట్ల నిధులు

✪ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



భైంసా, ప్రభాతవార్త:

ముథోల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి తన కోటా కింద రూ.70 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వెల్లడించారు. శనివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల సర్పంచులకు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.17 కోట్లు, పొలం బాట పనులకు రూ.8 కోట్లు కేటాయించామన్నారు. అలాగే మహిళా సమైక్య భవనాలు, గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి రూ.45 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. సర్పంచులు అభివృద్ధిని లక్ష్యంగా చేసుకుని పనిచేయాలని, ఈ నిధులతో గ్రామాల్లోని ప్రధాన సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అసెంబ్లీలో తాను పలుమార్లు చేసిన విన్నపంతో ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం శుభపరిణామమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. 28వ ప్యాకేజీ పనులు పూర్తయితే నియోజకవర్గంలో సుమారు 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఏడాది రూ.100 కోట్లతో మిగతా 2లో..

## రేషన్ బియ్యం

# పట్టివేత

కెరమెరి, మార్చి 21, ప్రభాతవార్త:

మండలంలోని సుర్దాపూర్ ఎక్స్ రోడ్డ వద్ద శనివారం పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మధుకర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. కెరమెరి నుంచి ఆసిఫాబాద్ వైపు వెళ్తున్న (టీఎస్01 యుబి 1561) నెంబర్ గల బొలెరో వాహనంపై అనుమానం కలగడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో వాహనంలో సుమారు 15 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. గ్రామాల్లో ప్రభుత్వ రేషన్ పొందుతున్న లబ్ధిదారుల వద్ద నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరలకు విక్రయించే అక్రమ రవాణా జరుగుతోంది. ఈ క్రమంలో సొమ్ము చేసుకునేందుకు కొందరు దందా సాగిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై వాహనం డ్రైవర్ గుర్నులే మధుకర్ మిగతా 2లో..



# పుట్టుకే పరిత్యాగం...



## పత్తి చేనులో ప్రాణ పోరాటం

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 21, ప్రభాతవార్త :

మనసును ముక్కలు చేసే ఘటన... మానవత్వాన్ని గుర్తు చేసిన స్పందన.. కాగజ్‌నగర్ మండలంలోని వల్లకొండ గ్రామపంచాయతీ పరిధి సీతానగర్ శివారులో శనివారం చోటుచేసుకుంది. పత్తి చేనులో గుడ్డలో చుట్టి పడేసిన పసికందును గుర్తించిన గ్రామస్తులు ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. తల్లి ఒడిలో ఉండాల్సిన ఆ పసికందు, ఆకలితో అలమటిస్తూ గుక్కపట్టి ఏడుస్తుండటం అక్కడివారిని కన్నీళ్లు పెట్టించింది.

- ✶ అమ్మ ఒడికి దూరమైన పసికందు, గుండెలను పిండేసిన ఘటన
- ✶ గుడ్డలో చుట్టి పడేసిన శిశువు గ్రామస్తులు, పోలీసుల చాకచక్యంతో ప్రాణరక్షణ



పసికందును పత్తి చేనులో నుంచి బయటకు తీసిన గ్రామస్థులు, పోలీసులు




2లో..

## ఈద్గా వద్ద ప్రార్థనలు..

- ➡ ముస్లింలతో మంత్రి వివేక్ ఐక్యత సందేశం
- ➡ ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు
- ➡ అభివృద్ధి పనులకు హామీ

మందమర్రి, మార్చి 21, ప్రభాతవార్త

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మందమర్రి పట్టణంలోని విద్యానగర్, సీఈఆర్ క్లబ్ సమీపంలోని ఈద్గా వద్ద నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో కార్మిక, మైనింగ్ శాఖ మంత్రి మిగతా 2లో..



## ప్రశాంతంగా ముగిసిన రంజాన్ వేడుకలు

భైంసా, మార్చి 21, ప్రభాతవార్త:

భైంసా పట్టణంలో రంజాన్ ప్రార్థనలు అత్యంత ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల స్వయంగా రంగంలోకి దిగి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం పండుగ సందర్భంగా పట్టణంలోని ఈద్గా వద్దకు ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో తరలివచ్చి ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థనల సమయంలో రద్దీ కారణంగా ముగ్గురు చిన్నారులు తమ కుటుంబ సభ్యుల నుంచి తప్పిపోయారు. అక్కడే ఉన్న ఎస్పీ జానకి షర్మిల వెంటనే స్పందించి, అధికారులను అప్రమత్తం చేశారు. పోలీసుల చొరవతో కొద్దిసేపటికే ఆ చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులకు సురక్షితంగా మిగతా 2లో..



## ముథోల్ అభివృద్ధికి రూ.70 కోట్ల నిధులు

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి పనులు చేపట్టామని, ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో ముందుకు సాగుతున్నామన్నారు. గ్రామాల వారీగా చింతలబోరి (రూ.1 కోటి), బుజ్జూర్ (రూ.45 లక్షలు), మలేగం (రూ.22 లక్షలు), కుంటాల (రూ.20 లక్షలు), కిష్టాపూర్ (రూ.19 లక్షలు), దేగం (రూ.15 లక్షలు), కనకాపూర్ (రూ.12 లక్షలు), మంజీరి (రూ.12 లక్షలు), సుంక్లి (రూ.9 లక్షలు), కరెగాం (రూ.6 లక్షలు), ఓలా (రూ.5 లక్షలు), అంతర్ణి (రూ.5 లక్షలు) చొప్పున నిధులు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షులు పండితరావు పటేల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేష్ బాబు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)

(అడ గ్రామం.ఆసిఫాబాద్) వాహనం యజమాని మహమ్మద్ రియాజ్ ఖాన్(జానకపూర్, ఆసిఫాబాద్) ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రేషన్ బియ్యాన్ని విక్రయించే వారు, కొనుగోలు చేసే వారిపైనా కూడా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని, ప్రజలు కూడా సహకరించి అక్రమ రవాణా గురించి సమాచారం అందించాలని ఎస్ఐ మధుకర్ కోరారు.

## ఈద్గా వద్ద ప్రార్థనలు..

(మొదటిపేజీ తరువాయి)

గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలసి ప్రార్థనలు చేసి వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెన్నూరు నియోజకవర్గంలో గంగా జమున తహజీబ్‌ను ప్రతిబింబించే విధంగా అన్ని మతాల ప్రజలు సౌభ్రాతృత్వంతో కలిసి జీవిస్తున్నారని అన్నారు. ప్రేమానురాగాలు, మానవత్వంతో ప్రజలు ఐక్యంగా ఉంటేనే సమాజం సుభిక్షంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మందమర్రి పట్టణంలో ముస్లిం సోదరుల సౌకర్యార్థం రూ.50 లక్షలతో షాదీఖానా నిర్మాణం, ఈద్గా వద్ద కాంపౌండ్ వాల్ ఏర్పాటుకు త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా సింగరేణి సంస్థతో చర్చించి ఈద్గా వద్ద కమాన్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన రంజాన్ వేడుకలు

(మొదటిపేజీ తరువాయి)

అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు చిన్నారులకు చాక్లెట్లు పంచి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తమ పిల్లలను క్షేమంగా అప్పగించినందుకు తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈద్గా వద్ద ప్రత్యేకంగా పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేయడంతో పాటు, ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా రంజాన్ ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సాయి కిరణ్, ఇన్స్‌పెక్టర్లు మల్లేష్, ప్రవీణ్ కుమార్, సాయి కుమార్, ఎస్సై అశోక్, ఆర్ఎస్సైలు రవి, సాయికృష్ణ, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

### - పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు

**క్యాతన్‌పల్లి, మార్చి 21, ప్రభాత వార్త**

క్యాతనపల్లి మున్సిపాలిటీలో అర్హులైన ఇండ్లు లేని నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు కోరారు. శనివారం విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీల హామీల్లో భాగంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు పథకాన్ని కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు క్యాతనపల్లి మున్సిపాలిటీలో స్థలం ఉండి సరైన ల్యాండ్ డాక్యుమెంట్ కలిగిన ప్రజలు (ఎల్.1 లిస్ట్ )ఇందిరమ్మ ఇండ్ల కొరకు తమ దరఖాస్తును వార్డు కౌన్సిలర్లకు గానీ,ఆయా వార్డులలోని కాంగ్రెస్ నాయకులకు గానీ లేదంటే నేరుగా క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో అందించవలసిందిగా కోరారు. దరఖాస్తు తో పాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోటో, బ్యాంకు పాస్ బుక్, ల్యాండ్ డాక్యుమెంట్/పట్టా పాసుబుక్ /జీవో 76 సింగరేణి ల్యాండ్ డీడ్ జిరాక్స్ ప్రతులను జత పర్చాలని కోరారు.

# పుట్టుకే పరిత్యాగం...




(మొదటిపేజీ తరువాయి)

పసిబిడ్డ కేకలు విన్న ఓ మహిళ దగ్గరకు వెళ్లి చూసినప్పుడు గుడ్డలు చుట్టబడి ఉన్న శిశువు కనిపించడంతో ఆమె ఆందోళనకు గురైంది. వెంటనే గ్రామస్తులకు సమాచారం ఇచ్చి ఆలస్యం చేయకుండా పోలీసులకు తెలియజేశారు. గ్రామస్తుల అప్రమత్తతతో క్షణాల్లో స్పందించిన పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని శిశువును సురక్షితంగా బయటకు తీశారు. వల్లకొండ సర్పంచ్, స్థానికులతో కలిసి శిశువును వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించారు. శిశువు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. అనంతరం కాగజ్ నగర్ రూరల్ సిఐ కుమారస్వామి, ఈస్గాం ఎస్సై కళ్యాణ్ బాలల సంరక్షణ శాఖ అధికారులకు అప్పగించారు. పసికందును అక్కడ వదిలేసిన గుర్తుతెలియని వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ సంఘటన సమాజాన్ని ఆలోచింపజేస్తుంది. పుట్టిన బిడ్డను ఇలా వదిలేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చింది? ఆర్థిక ఇబ్బందులా? సామాజిక ఒత్తిడులా? లేదా మరేదైనా కారణమా? ఏ కారణం అయినా పసిబిడ్డను ఇలా నిరధారంగా వదిలేయడం మానవత్వానికి విరుద్ధమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్న భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు

## శిక్షణ తరగతులు ప్రారంభించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి

**మంచిర్యాల, మార్చి 21, ప్రభాతవార్త**

భారతీయ జనతా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే రెండు రోజుల బీజేపీ పార్టీ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ శిక్షణ తరగతులను శనివారం రోజు మంచిర్యాల పట్టణం కాలేజ్ రోడ్ తాండ్ర పాపరాయుడు ఫంక్షన్ హాల్ లో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ అంటే ఒక్క సిద్ధాంతం కోసం పనిచేసే పార్టీ అని ప్రజల కోసం పనిచేసే పార్టీ కేవలం బీజేపీ మాత్రమే అని అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యం బీజేపీ పార్టీ ప్రజల కోసం దేశ అభివృద్ధి కోసం పని చేస్తుంది అని తెలిపారు. ఈ శిక్షణ తరగతులు రెండు రోజుల పాటు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ జోనల్ అధ్యక్షులు అమిరిశెట్టి రాజ్ కుమార్, రంగ శ్రీశైలం, కుర్రే చక్రవర్తి, సత్రం రమేష్, వంగపల్లి వెంకటేశ్వర్ రావు, ఎనగందుల కృష్ణ మూర్తి, కార్పొరేటర్లు ముఖేష్ గౌడ్, కస్తూరి నాగరాజు, వనపర్తి కేత, తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా సాధ్వి నిరంజన్ జ్యోతి నియామకంపై గంగపుత్రుల హర్షం

**మంచిర్యాల, మార్చి 21, ప్రభాతవార్త**

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా సాధ్వి నిరంజన్ జ్యోతిని కేంద్ర ప్రభుత్వం నియమించడం పట్ల తెలంగాణ గంగపుత్ర సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. బీసీలలో అత్యంత వెనుకబడిన గంగపుత్ర వర్గానికి చెందిన సాధ్వి నిరంజన్ జ్యోతికి ఈ కీలక పదవిని అప్పగించడం గర్వకారణమని కొనియాడారు. రాబోయే రోజుల్లో వెనుకబడిన తరగతుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని ఆకాంక్షించారు. గంగపుత్రులు సాధ్వి నిరంజన్ జ్యోతిని స్ఫూర్తిగా తీసుకుని రాజకీయాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. బీసీల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిన కేంద్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గంగపుత్ర సంఘం పట్టణ అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు మంచిర్ల సదానందం, పంపరి వేణుగోపాల్, బీసీ నాయకులు వేముల అశోక్, మేడి శేఖర్, జంబోజు శ్రీనివాస్, రాచమల్ల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## వాంకిడిలో ఘనంగా రంజాన్ పండుగ వేడుకలు

**- ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు**

**- ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన వాంకిడి సర్పంచ్ సతీష్, ఎస్ఐ దుర్గం మహేందర్**

**వాంకిడి, మార్చి 21, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలో ముస్లింల పవిత్ర పండుగ రంజాన్ (ఈద్‌ఉల్ ఫితర్)ను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ పవిత్ర పండుగ సందర్భంగా ఉదయం 9 గంటలకు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు గావించి, ఒకరినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ పండుగ వేడుకలకు సర్పంచ్ సతీష్, ఎస్సై దుర్గం మహేందర్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు సందేశమిస్తూ నెలరోజుల పాటూ కఠిన ఉపవాస దీక్షలు చేపట్టి క్రమశిక్షణతో అల్లాఃహ్ ఆశీస్సులు పొందిన ముస్లింలకు ఈ పండుగ సుఖ సంతోషాలను ఇవ్వాలని కోరారు. అదేవిధంగా గ్రామంలో అందరం సోదర భావంతో సామరస్యంగా కలిసిమెలిసి ఉండాలని ఆకాంక్షించారు. రంజాన్ పండుగను ప్రతి ముస్లిం సోదరుడు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండే తుకారం, బంబారా మాజీ సర్పంచ్ అయ్యుబ్, మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్ సఫీక్, మైనార్టీ సెల్ అధ్యక్షులు హమీద్, ముస్లిం మత పెద్దలు, డైలీ క్రికెట్ యూత్ సభ్యులు ఎంగలి రాకేష్, అశుతోష్, అహ్మద్, అర్బాజ్, సమీర్, సానిఫ్, తదితరులు పాల్గొన్నారు.



## మాలలోనూ మానవత్వం...!

**పెంచికల్‌పేట్, మార్చి 21, ప్రభాతవార్త :**

ఆపదలో అండగా నిలిచే మనసే అసలైన భక్తి... ఆ భక్తి మానవత్వంగా మారితే ప్రాణాలకు పునర్జన్మ లభిస్తుంది! మంచిర్యాల ఆసుపత్రిలో చోటుచేసుకున్న ఈ హృద్యమైన ఘటన అదే సందేశాన్ని బలంగా చెబుతోంది. శనివారం పెంచికల్ పేట్ మండలం కొండపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ అత్యవసర శస్త్రచికిత్స అనంతరం చికిత్స పొందుతుండగా బి పాజిటివ్ రక్తం అత్యవసరంగా అవసరమైంది. హనుమాన్ దీక్షలో (మాలలో) ఉన్న మానవతా పిలుపు ముందు వెనకడుగు వేయని ఇద్దరు యువ నాయకులు దేవదూతల్లా ప్రత్యక్షమయ్యారు. హనుమాన్ దీక్షలో ఉన్న అగర్ గూడ మాజీ సర్పంచ్ పాలే సుధాకర్, చేడ్వాయి యువనాయకుడు పాలే మహేష్ వెంటనే స్పందించి ఆసుపత్రికి చేరుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. తమ ఆచారాలను మానవ సేవకు అడ్డంకిగా కాకుండా ఆదర్శంగా మార్చిన ఈ ఘటన అక్కడున్న ప్రతి హృదయాన్ని కదిలించింది. వారి రక్తదానం ఓ ప్రాణానికి నూతన ఆశలు నింపగా కుటుంబ సభ్యులు, వైద్య సిబ్బంది, పలువురు వారి సేవభావాన్ని కొనియాడారు. సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలిచిన ఈ ఘటన స్థానికంగా ప్రశంసల వెల్లువెత్తింది. భక్తి అంటే భజనలు మాత్రమే కాదు, అవసరంలో మనిషికి తోడుగా నిలవడమే అన్న సందేశాన్ని ఈ సేవాపరులు సజీవంగా చాటిచెప్పారు.






సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

## బీసీలకు బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం

### - బీఆర్ఎస్ పార్టీ ఆగ్రహం

బెల్లంపల్లి, మార్చి 21, ప్రభాతవార్త

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 56 శాతం ఉన్న బీసీ జనాభాకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో తీవ్ర అన్యాయం చేసిందని వారు తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీల అభివృద్ధి కోసం ప్రతి సంవత్సరం రూ.20,000 కోట్లను కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తుచేశారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం రూ.12,500 కోట్లు మాత్రమే కేటాయించడం ద్వారా బీసీలను మోసం చేసిందని ఆరోపించారు. ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం మూడు సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టినప్పటికీ, ఇచ్చిన హామీని అమలు చేయలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్ బీసీ వర్గాలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో బీసీ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెబుతారని, తమ హక్కుల కోసం పోరాటం కొనసాగుతుందని బీఆర్ఎస్ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, కౌన్సిలర్ దొంగల రాజకుమార్, నాయకులు బండారి ప్రవీణ్ కుమార్, పయవేన మల్లేష్, మధు తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో ఉపాధ్యాయులు

## అపూర్వ సమ్మేళనం

హాజీపూర్, మార్చి 21, ప్రభాతవార్త

మండలంలోని చొక్కా రామ్ నగర్ రాంపూర్ లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 2000-2001 పదవ తరగతి విద్యార్థుల 25 సంవత్సరాలు రజతోత్సవాన్ని పురస్కరించుకుని విద్యారణ్య ఆవాస విద్యాలయం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థులు పూలతో ఆహ్వానం పలికారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించి తమ గౌరవాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ విద్యార్థులు ఆనందంగా కలుసుకున్నారు. సుమారు 70 మంది పూర్వ విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. పాఠశాలలో గడిపిన మధురమైన రోజుల్ని గుర్తు చేసుకుంటూ గురువులను స్మరించుకున్నారు.పాఠశాల అభివృద్ధికి తమ వంతుగా కొంత విరాళం కూడా అందజేశారు. అందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు కట్ట వెంకట్ రెడ్డి,రావుల రామన్న, పూర్వ విద్యార్థులు మెంగని వెంకటస్వామి, చింత అభినయ్, చెలిమల శ్రవణ్, సంతోష్ రెడ్డి, తూముల ప్రభాకర్, ఈగం సంతోష్, సతీష్ రెడ్డి, రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి, మత సామరస్యాలకు ప్రతీక రంజాన్: మంత్రి వివేక్

క్యాతన్‌పల్లి, మార్చి 21, ప్రభాతవార్త



శాంతికి, మత సామరస్యాలకు ప్రతీక రంజాన్ పండుగ అని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకట స్వామి అన్నారు. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా ఆయన ఈద్గా వద్ద జరిగిన ప్రార్థనల్లో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తవక్కల్ పాఠశాలల అధినేత అబ్దుల్ అజీజ్ ఇంట్లో జరిగిన విందులో ఆయన తన అనుచర వర్గంతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ రంజాన్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పవిత్ర పండుగ అందరి జీవితాల్లో ఆనందం, ఐశ్వర్యం నింపాలని, సమాజంలో ఐక్యత మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డి.సి.సి అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి, రామకృష్ణాపూర్ పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, కౌన్సిలర్‌లు కూతురు ప్రభాకర్, గుర్రం శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్‌లు పొలం సత్యం, పానసా రాజు,నాయకులు గోపతి రాజయ్య, గాండ్ల సమ్మయ్య, పుల్లూరి కళ్యాణ్, గంగారపు సత్య పాల్, భైర మల్లేష్, బత్తుల వేణు, నక్క శ్రీనివాస్, స్థానిక ముస్లిం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మానవ తప్పిదాలతో అడవుల్లో అగ్ని ప్రమాదాలు

### * అడవులకు, ప్లాంటేషన్‌లకు నష్టం
### * టీజీఎఫ్‌డీసీ ప్లాంటేషన్ మేనేజర్ సురేష్ కుమార్

జైపూర్, మార్చి 21, ప్రభాతవార్త

మానవ తప్పిదాలతో అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తూ, అడవులకు, అడవిలో నాటిన ప్లాంటేషన్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టీజీఎఫ్‌డీసీ) మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేష్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని టీజీఎఫ్‌డీసీ ఆధ్వర్యంలో జైపూర్ మండలంలోని ముదికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని నీలగిరి ప్లాంటేషన్ లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యంగా వేసవి కాలంలో మానవ నిర్లక్ష్యం వల్లనే కొన్ని చోట్ల అడవుల్లో అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయని, తద్వారా చెట్లు ఎండిపోవడమే కాక ఎన్నో జీవరాసులు చనిపోతున్నాయన్నారు. అడవుల్లో బీడీలు సిగరెట్లు తాగి నిర్లక్ష్యంగా పడేయవద్దని, తమ స్వార్థ ప్రయోజనాల కోసం నిప్పు పెట్టవద్దని కోరారు. అడవులు మానవాళి మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు ఎన్నో రకాలుగా తోడ్పడుతున్నాయన్నారు. వీటిని కాపాడుకోవాల్సిన అవసరం అందరిపై ఉందన్నారు. అడవులు, ప్లాంటేషన్లను కాపాడడానికి కృషి చేస్తున్న అటవీ శాఖ సిబ్బందికి ప్రజలు తమ వంతు సహకారం అందించి పర్యావరణాన్ని రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఎఫ్‌డిసి సిబ్బంది రాజేష్, శంకర్, సంజీవ్‌లు పాల్గొన్నారు.






## కృష్ణ కాలనీ సమస్యలు పరిష్కరించండి

### - శ్రీరాంపూర్ జీఎంకు కార్పొరేటర్ పత్తి ప్రకృతి వినతి

నస్పూర్, మార్చి 21, ప్రభాతవార్త

మంచిర్యాల నగర పాలక సంస్థ మూడో డివిజన్ కృష్ణ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ పత్తి ప్రకృతి శనివారం శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఈ సందర్భంగా వివరించారు. స్థానిక సమస్యల పట్ల శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. మూడో డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులను, ఇతర సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మౌలిక సదుపాయాల మెరుగుదలకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పత్తి వెంకటేష్, మోతే కనకయ్య, రాగిడి రాజు, నాసర్, ఉప్పుల రమేష్ పాల్గొన్నారు.

## రంజాన్ మాసంలో చేసే దానధర్మాలు అందరికీ సౌభ్రాతృత్వం, సమృద్ధిని కలిగిస్తాయి

### - ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్

జన్నారం, మార్చి 21, ప్రభాతవార్త

రంజాన్ మాసం చాలా పవిత్రమైన మాసమని ఈ మాసంలో చేసే ప్రార్థనలు, దానధర్మాలు అందరికీ సౌభ్రాతృత్వం, సమృద్ధిని కలిగిస్తాయని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం నాడు రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా జన్నారం మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఫసి ఉల్ల ఇంటికి విచ్చేసి పార్టీ నాయకుడు ఫసి ఉల్ల అలాగే కుటుంబ సభ్యులు అందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైనదని , ఈ మాసంలో చేసే ప్రార్థనలు అందరికీ శాంతినీ కలిగిస్తుందని ,అందరూ మనస్ఫూర్తిగా సోదరభావంతో మెలుగుతూ సంతోషంగా జరుపుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన అన్ కార్యదర్శి ఫసి ఉల్ల, పార్టీ నాయకులు, అలాగే పంచాయతీ వార్డు మెంబర్లు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## గిరిజాయి మాత జాతరలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మార్చి 21, ప్రభాతవార్త:

భీంపూర్ మండలంలో వెలిసిన గిరిజాయి మాత ఆలయ జాతర ఉత్సవాల్లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శనివారం పాల్గొన్నారు. జాతర సందర్భంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమ్మవారికి సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలగాలని కోరుకున్నట్లు తెలిపారు. జాతర ప్రాముఖ్యతను, భక్తుల విశ్వాసాన్ని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా రంజాన్ వేడుకలు





**బెల్లంపల్లి, మార్చి 21, ప్రభాతవార్త**

ముస్లిం మైనార్టీలకు అత్యంత పవిత్రమైన పండుగ రంజాన్ సందర్భంగా బెల్లంపల్లి పట్టణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. శనివారం నిర్వహించిన ఈ వేడుకలు ప్రశాంతంగా, ఉత్సాహభరితంగా సాగి పట్టణ ప్రజలందరికీ సంతోషాన్ని పంచాయి. ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్న ముస్లింలు ఈ పండుగను విశేష భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం తెల్లవారుజామున నుంచే పట్టణంలోని మసీదులు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కొత్త దుస్తులు ధరించిన చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ ఆనందోత్సాహాలతో పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహంగా మార్చారు. ముఖ్యంగా అశోక్ నగర్ ఈద్గా వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేసి, పెద్ద సంఖ్యలో భక్తులు సౌకర్యవంతంగా ప్రార్థనలు నిర్వహించుకునేలా చర్యలు తీసుకున్నారు. కన్నాల బస్తీ, టేకుల బస్తీ, హనుమాన్ బస్తి, బజార్ ఏరియా, కాంట్రాక్టర్ బస్తీ, రడగంబాల బస్తి, గణేష్ నగర్, బూడిద గడ్డ, నెంబర్ టూ ఇంక్లైన్ బస్తీ, కాల్ టెక్స్ ఏరియా, రైల్వే కాలనీ, సుభాష్ నగర్, శాంతి ఖని బస్తీ తదితర ప్రాంతాల నుంచి వేలాదిగా ముస్లింలు ఉదయం 9 గంటల ప్రాంతంలో ఈద్గా వద్దకు చేరుకుని సమూహంగా నమాజ్ అర్పించారు. ప్రార్థనల సమయంలో ఇమామ్ శాంతి, సోదరభావం, పరస్పర గౌరవం, సేవాభావం వంటి విలువలపై సందేశం ఇచ్చారు. దేశం అభివృద్ధి చెందాలని, సమాజంలో ఐక్యత పెరగాలని ప్రార్థనలు చేశారు. ప్రార్థనల అనంతరం ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. చిన్నారులు పెద్దల ఆశీస్సులు తీసుకుని పండుగ ఆనందాన్ని ఆస్వాదించారు. పలు చోట్ల మిఠాయిలు, షీర్ కుర్మా వంటి ప్రత్యేక వంటకాలు పంచుకొని పండుగ సంబరాలను మరింత రంగురంగులుగా మార్చారు. అనంతరం బాబు క్యాంప్ సమీపంలోని కబ్రస్థాన్‌కు వెళ్లిన ముస్లింలు తమ కుటుంబ సభ్యులను స్మరించుకొని ప్రార్థనలు చేశారు. మరణించిన తమ బంధువులకు నివాళులు అర్పించి, వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ సందర్భం భావోద్వేగ భరితంగా సాగింది. పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, జనసంచారం పర్యవేక్షణ వంటి చర్యలు సమర్థంగా నిర్వహించారు. పోలీసుల అప్రమత్తత వల్ల వేడుకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగాయి. మొత్తం మీద బెల్లంపల్లి పట్టణంలో రంజాన్ వేడుకలు భక్తి, భద్రత, ఆనందాల సమ్మేళనంగా నిలిచి, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచాయి. ఈ పండుగ పట్టణ ప్రజల మధ్య ఐక్యతను మరింత బలపరిచింది.

**బెజ్జూర్, మార్చి 21, ప్రభాతవార్త**

బెజ్జూర్ మండల కేంద్రంలోని ఈద్గా మైదానంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మోలానా రంజాన్ ఉపవాసాల ఆవశ్యకతను, నమాజ్ ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు. మండలంలోని మర్తిడి, బెజ్జూర్, కుకుడ గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రార్థనలు జరగ్గా, గోల్కొండ గ్రామంలో మసీదులో నమాజ్ నిర్వహించారు. నమాజ్ అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

**కాగజ్‌నగర్ రూరల్, మార్చి 21, ప్రభాతవార్త**

నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లిం సోదరసోదరీమణులు శనివారం పవిత్ర రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే కాగజ్‌నగర్ పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లోని ఈద్గాలకు పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని ప్రత్యేక నమాజ్ నిర్వహించారు. తెల్లవారుజామునే కొత్త దుస్తులతో, ఆనందోత్సాహాల మధ్య కుటుంబ సమేతంగా ప్రార్థనలకు హాజరయ్యారు. ప్రార్థనల అనంతరం మత పెద్దలు ప్రవక్త మహమ్మద్ బోధనలను వినిపిస్తూ, పరస్పర ప్రేమ, సహనం, దయా గుణాలను ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో పేదలు, అనాథలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంతో పాటు వివిధ గ్రామాల ఈద్గాలను ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు సందర్శించి ముస్లిం సోదరులతో ఆత్మీయంగా పలకరించి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, అన్ని వర్గాల ప్రజలు ఐక్యతతో జీవించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు. పండుగ సందర్భంగా చోటుచేసుకున్న ఈ ఆత్మీయ వాతావరణం సమాజంలో సఖ్యత, సామరస్యానికి ప్రతీకగా నిలిచింది.

**లక్సెట్టిపేట, మార్చి 21, ప్రభాతవార్త**

లక్సెట్టిపేట పట్టణంలో రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని క్లబ్ రోడ్‌లో ఉన్న ఈద్గా వద్ద ముస్లిం సోదరులు భారీగా తరలివచ్చి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద నీడ కోసం టెంట్లు, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు మున్సిపల్ చైర్మన్ దొంత అంజలి నరసయ్య, వైస్ చైర్మన్ రాజేశ్వరి వెంకటస్వామి గౌడ్, కౌన్సిలర్లు పలువురు నాయకులు ఈద్గా వద్దకు వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముస్లిం మైనారిటీ అధ్యక్షులు సయ్యద్ షాహిద్ అలీ, అధికారులతో కలిసి అన్ని చర్యలు తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై గోపతి సురేష్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు నిర్వహించారు.



ఈద్గా వద్ద పరస్పర శుభాకాంక్షలు తెలుపుకుంటున్న దృశ్యం



కాగజ్‌నగర్‌లో .. ముస్లీం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప



కాగజ్‌నగర్‌లో..



చింతగూడ కోయవాగులో..



శుభాకాంక్షలు తెలుపుకుంటున్న ముస్లీం సోదరులు

## ఘనంగా రంజాన్ పండుగ

**కెరమెరిచ మార్చి 21, ప్రభాతవార్త :**

పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం కెరమెరి మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఇద్గా వద్ద సామూహిక ప్రార్థనలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఈద్ ముబారక్ అంటూ ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

## ఆదివాసీ మహిళలపై దాడులు అరికట్టాలి

### - ఆత్రం సమ్మక్కకు న్యాయం చేయాలని డిమాండ్

**పెంచికల్‌పేట్, మార్చి 21, ప్రభాతవార్త :**

మండలంలోని కొండపల్లి గ్రామంలో కులోన్మాద హత్యకు గురైన గిరిజన గర్భిణీ ఆత్రం సమ్మక్క కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని ఎల్కపల్లి ఎస్సీ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో గోండ్వానా కోయ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తలండి మధుకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారించి నిందుతులను వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. భాధిత కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్ గ్రేషియా, ఒకరికి ఉద్యోగం, భూమి ఇవ్వాలని, ఆదివాసీ మహిళల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ నెల 23న కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

## సమ్మక్క కుటుంబానికి ఎమ్మెల్యే హరీష్ బాబు ఆర్థిక సహాయం

**పెంచికల్ పేట్, మార్చి 21, ప్రభాతవార్త :**

మండలంలోని కొండపల్లి గ్రామంలో హత్యకు గురైన ఆత్రం సమ్మక్క కుటుంబాన్ని శనివారం సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పరామర్శించి, ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ హత్య కేసులో నిందితులు ఎవరిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ఇప్పటికే ఒకరిని రిమాండ్ కు పంపినట్లు తెలిపారు. ఈ ఘటనలో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిని చట్టం ముందు నిలబెడతామని హామీ ఇచ్చారు. సమ్మక్క కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని, వారికి ఇందిరమ్మ ఇళ్లను కూడా మంజూరు చేస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో కక్షలు, కార్పణ్యాలు పెంచుకొని జీవితాలను నాశనం చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుకిడే రాజేష్, సర్పంచ్ చప్పిడి రవీందర్, నాయకులు అన్నం గణపతి, పురుషోత్తం, నగేష్, భీమయ్య, అనంత్ రావు, శేఖర్, ప్రసాద్, ప్రభాకర్, రమేష్, శంకర్, చంద్రు తదితరులు పాల్గొన్నారు.




రోగులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యబృందం

## కుంజర యాత్ర ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన

**లక్ష్మణచాంద, మార్చి 21, ప్రభాతవార్త:**

మండలంలోని వడ్యాల్ గ్రామంలో శనివారం నిర్వహించిన కుంజర యాత్ర ఉచిత వైద్య శిబిరానికి ప్రజల నుండి భారీ స్పందన లభించింది. ఈ శిబిరంలో సుమారు 420 మందికి పైగా వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్, ఎండోస్కోపీ, షుగర్, బీపీతో పాటు గుండెకు సంబంధించిన ఈసీజీ, 2డీ ఎకో వంటి 10 రకాల పరీక్షలను రోగులకు ఉచితంగా చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విమలాకర్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించి ప్రాణనష్టాన్ని నివారించడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ కుంజర యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్య విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ఉచిత శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నరేష్, గ్రామ కోశాధికారి సల్ల రాజేంద్రప్రసాద్, వీడీసీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

## మహిళా సమైక్య భవన పనులను త్వరగా పూర్తి చేయాలి

### - డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి

**భైంసా, మార్చి 21, ప్రభాతవార్త:**

భైంసా మండలంలోని దేగాం గ్రామంలో నిర్మాణంలో ఉన్న మహిళా సంఘ భవనాన్ని డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. భవన నిర్మాణ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్న ఆమె, మిగిలిన పనులను త్వరలోనే పూర్తి చేయాలని సర్పంచ్ సిరం సుష్మా రెడ్డికి సూచించారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించడంలో అలసత్వం వహించరాదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. గ్రామానికి విచ్చేసిన అధికారులను సర్పంచ్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం రమేష్, ఉపసర్పంచ్ బాలేకర్ శివాజీ, వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**సారంగాపూర్, మార్చి 21, ప్రభాతవార్త:**



మండలంలోని చించోలి (బి) గ్రామానికి చెందిన పల్లెర్ల పెద్ద సాయన్న (61) మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు గత కొన్ని ఏళ్లుగా అప్పుల పాలై తన ఇల్లు కూడా అమ్ముకోవాల్సి వచ్చింది. గత మూడు నెలల నుండి ఎటువంటి పని చేయకుండా, ఆర్థిక ఇబ్బందుల వల్ల మద్యానికి బానిసయ్యాడు. శనివారం చించోలి (బి) లోని కల్లు దుకాణంలో మద్యం సేవించిన సాయన్న, మత్తులో గ్రామ శివారులోని పాత నేషనల్ హైవే44 పక్కన, ఆర్టీఓ ఆఫీసు వెళ్లే దారిలో ఓ చెట్టుకు ఉరివేసుకొని మృతి చెందాడు. మృతుడి భార్య పల్లెర్ల నర్సవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉండగా, ఒకరు దుబాయ్‌లో, మరొకరు నిర్మల్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నారు.

# విద్యారంగాన్ని విస్మరించిన బడ్జెట్..

**● విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ఆటలు! ● సవతి తల్లి ప్రేమ చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**● ఏఐఎఫ్డిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్**

**బెల్లంపల్లి, మార్చి 21, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించిందని అచల భారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య (ఏఐఎఫ్డిఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మొత్తం రూ. 3,24,234 కోట్ల రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ. 26,674 కోట్లు మాత్రమే కేటాయించడం బాధాకరమని అన్నారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి విద్యారంగానికి కేటాయించిన నిధులు కేవలం 8.22 శాతం మాత్రమేనని, గత 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఇది 7.6 శాతం ఉండగా, ఈసారి కేవలం 0.6 శాతం మాత్రమే పెరుగుదల ఉండటం గమనార్హమని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అంతేకాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వం నియమించిన విద్యా కమిషన్ కూడా విద్యారంగానికి కనీసం 18 శాతం నిధులు కేటాయించాలని సూచించినప్పటికీ, ప్రభుత్వం ఆ సిఫార్సులను పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ప్రస్తుతం బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో 80 శాతం కంటే ఎక్కువ జీతాలకే వెచ్చించబడుతున్నాయని, మిగతా అభివృద్ధి కార్యక్రమాలకు సరిపడా నిధులు లేవని అన్నారు. ప్రభుత్వం ప్రకటిస్తున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు, విద్యా మిషన్ ప్రణాళికలు అమలు కావడం కష్టమని అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ విద్యార్థుల స్కాలర్షిప్‌లు పెండింగ్‌లో ఉండడం, సర్టిఫికెట్లు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రాథమిక పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు మౌలిక సదుపాయాల లోపం తీవ్రంగా ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో విద్యారంగానికి నామమాత్ర కేటాయింపులు చేయడం విద్యా



వ్యవస్థను బలహీనపరచడమేనని, అభివృద్ధి అన్నది మాటల్లో మాత్రమే మిగిలిపోయిందని విమర్శించారు. విద్యార్థుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ద్రోహపూరిత వైఖరి అవలంబిస్తోందని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు.

## శబరిమాత పాదయాత్ర భక్తులకు ఘనస్వాగతం పలికిన బలరాం జాదవ్

**నేరడిగొండ, మార్చి 21, ప్రభాతవార్త:**



శ్రీరామనవమిని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా తాడ్వాయిలోని శబరిమాత ఆలయానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులకు నేరడిగొండ మండలం ధార్మిక్ నగర్‌లో ఘనస్వాగతం లభించింది. శనివారం మార్గమధ్యలో ధార్మిక్ నగర్‌కు చేరుకున్న సుమారు 400 మంది భక్తులకు తెలంగాణ రాష్ట్ర అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ తన నివాసంలో బస ఏర్పాటు చేశారు. లోక కల్యాణార్థం కాలినడకన వెళ్తున్న భక్తుల కోసం ఆయన పండ్లు, ఫలాలు, అల్పాహారం ఏర్పాటు చేసి సేదతీరేలా చూశారు. ఈ సందర్భంగా బలరాం జాదవ్ మాట్లాడుతూ.. శబరిమాత చిన్ననాటి నుండే శ్రీరామునిపై భక్తితో రామమార్గంలో నడిచిందని, ఆమె గొప్ప రామభక్తురాలిగా నిలిచిపోయిందని కొనియాడారు. భక్తులతో కలిసి ఆయన కూడా కొంతదూరం అడుగులు వేసి వారికి వీడ్కోలు పలికారు. తమపై ఉన్న అభిమానంతో ప్రతిఏటా సేవలందిస్తున్న బలరాం జాదవ్‌కు భక్తులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రత్నాపూర్ కాండ్లీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

**నిర్మల్, మార్చి 21, ప్రభాతవార్త:**



నిర్మల్ రూరల్ మండలంలోని రత్నాపూర్ కాండ్లీ గ్రామ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ గడ్డం హరీష్ శనివారం ప్రారంభించారు. కాలనీవాసుల చిరకాల వాంఛ అయిన ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో ఆయన స్వయంగా పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి, ప్రజల సౌకర్యార్థం మరిన్ని మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణంతో పాటు మురుగునీటి కాలువలు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్య సౌకర్యాల మెరుగుదలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. తమ సమస్యను గుర్తించి రోడ్డు పనులు ప్రారంభించినందుకు కాలనీవాసులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాలనీవాసులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి ఉత్తమ అటవీ అధికారిగా ఎండి నజీర్ ఖాన్ ఎంపిక

**సారంగాపూర్, మార్చి 21, ప్రభాతవార్త:**



ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా సారంగాపూర్ ఉపఅటవీ క్షేత్రాధికారి ఎండి నజీర్ ఖాన్ రాష్ట్ర స్థాయి "ఉత్తమ అటవీ అధికారి" అవార్డుకు ఎంపికయ్యారు. ఈ నెల 23న హైదరాబాద్‌లోని దూలపల్లి తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించనున్న కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి కొండ సురేఖ, ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, ప్రధాన అటవీ సంరక్షణ అధికారి సువర్ణ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజల్లో పర్యావరణంపై చైతన్యం కల్పించడం వంటి అంశాల్లో నజీర్ ఖాన్ విశేష కృషి చేశారు. ముఖ్యంగా ఆల్ ఇండియా టైగర్ ఎస్టిమేషన్ 2026ను పకడ్బందీగా నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను ఈ గౌరవం దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ అవార్డుకు ఎంపికవ్వడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తనకు సహకరించిన ఉన్నతాధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వడ్డే రాజేందర్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన సత్యనారాయణ గౌడ్

**సారంగాపూర్, మార్చి 21, ప్రభాతవార్త:**

మండలంలోని ధని గ్రామ మాజీ సర్పంచ్ వడ్డే రాజేందర్ రెడ్డిని నిర్మల్ ఉమ్మడి మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు వి. సత్యనారాయణ గౌడ్ శనివారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం అమెరికాలోని అట్లాంటాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేందర్ రెడ్డి సోదరుడు వడ్డే దేవేందర్ రెడ్డి మృతి చెందారు. ఈ సందర్భంగా రాజేందర్ రెడ్డి కుటుంబ సభ్యులను కలిసిన సత్యనారాయణ గౌడ్, దేవేందర్ రెడ్డి మృతి పట్ల గాఢ సంతాపం ప్రకటించారు. ఆయన మరణం అత్యంత బాధాకరమని, కుటుంబ సభ్యులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారని తెలుపుతూ, బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఈ పరామర్శలో ఆలూరు మాజీ సర్పంచ్ శ్రీధర్ రావు, ముక్తాపూర్ మాజీ సర్పంచ్ సురేందర్ రెడ్డి, నాయకులు సాధు రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

